100 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తాళ్లపూడి బస్టాండ్ వద్ద గల కంకిపాటి ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు, రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు ప్రారంభించి మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘంతో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. రాజమహేంద్రవరంలోని వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యులు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు గోకవరపు బాబులు, నాయకులు కొండూరి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి ధరలు పైపైకి

- బహిరంగ మార్కెట్లో రూ.70పై మాటే
- ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో రూ.50
- కృతిమ కొరతతో కొనుగోలుదారులకు వాత



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉల్లిపాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రిటైల్ మార్కెట్లో నాణ్యత ఆధారంగా కేజీ రూ.70 నుంచి రూ.75 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. రైతు బజార్లలో కేజీ రూ.50 చొప్పున అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దేశంలో అత్యధికంగా మహారాష్ట్ర, నాసిక్‌లలో ఉల్లి ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ఇక్కడి నుంచే దేశంలో ఇతర ప్రాంతాలకు ఉల్లి ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం అక్కడ ఉత్పత్తి ఘననీయంగానే ఉన్నప్పటకీ ఇక్కడ సరకు దొరకడం లేదని, సరుకు రావడం లేదని వ్యాపారులు చెప్పి రోజుకో ధర నిర్ణయిస్తున్నారు.

రాజమహేంద్రవరం నగరంలో 10 రైతుబజార్లు ఉండగా... వాటిలో 8 మాత్రమే కొనుగోలుదారులకు సేవలందిస్తున్నాయి. వీటిలో రోజుకు 5టన్నుల ఉల్లి విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో మరో 50 టన్నుల వరకూ ఉల్లి విక్రయాలు జరుగుతాయని అంచనా. తాడేపల్లి గూడెం హోల్‌సేల్ మార్కెట్ నుంచి రోజుకు ఐదు లారీల ఉల్లి నగరానికి వస్తుంది. ఒక్కో లారీలో 35 టన్నుల వరకూ సరకు ఉంటుంది. హోల్‌సేల్ మార్కెట్‌లో కొన్న రేటుకు కిలోకు నాణ్యత ఆధారంగా రూ.3 నుంచి రూ.5 లాభం వేసుకొని వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ నెల 15న రైతుబజార్లలో కిలో ఉల్లి ధర రూ.50 కాగా బహిరంగ మార్కెట్లో నాణ్యతను బట్టి రూ.70 నుంచి రూ.75 చొప్పున విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం ఇదే ధర కొనసాగుతుంది.

రైతు బజార్లలో అందుబాటులో ఉల్లి

జిల్లాలోని రైతు బజార్లలో ఉల్లి అందుబాటులో ఉంది. డిమాండ్‌కు తగినట్లుగా ప్రతి రోజూ 5 టన్నుల ఉల్లి సరఫరా జరుగుతోంది. వరదల కారణంగా కొరత ఏర్పడింది. నాణ్యమైన సరుకులను విక్రయించాలని రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం, ఎస్టేట్ అధికారులు విక్రయాల తీరును పర్యవేక్షిస్తున్నారు. కొనుగోలుదారులకు సమస్యలు ఎదురైతే రైతు బజారులోని అధికారికి ఫిర్యాదు చేయొచ్చు.

- ఎం.సునీల్‌వినయ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి,

వ్యాపారుల మాయాజాలం

నాసిక్, మహారాష్ట్ర ఉల్లిపాయలకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో ఉల్లిని ఎక్కువగా పండిస్తారు. అయినప్పటికీ నాణ్యమైన ఉల్లపాయల కోసం ఇతర రాష్ట్రాల నుంచే ఇక్కడి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. కర్నూలు మార్కెట్లో ఉల్లి 100 కిలోల బస్తా గరిష్ఠంగా రూ.3100 పడుతోందని రవాణా, కూలిఖర్చులు కలుపుకుని ఇక్కడకు చేరేప్పటికి రూ.3,600 ఖర్చు అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. నాసిరకం ఉల్లి రూ.1,500కే లభిస్తున్నప్పటకి డిమాండ్ లేకపోవటంతో అత్యల్పంగా దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పుడున్నదంతా పాత పంట. కొత్త పంట జనవరి నుంచి మార్కెట్‌కు రానుందని చెబుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇక్కడి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారులు రోజూ ధరలు నిర్ణయించే అధికారులను లోబరుచుకొని వారికి అనుకూలమైన రేట్లు ప్రకటిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ హోల్‌సేల్ మార్కెట్‌పై జిల్లా అధికారులు దృష్టి సారించకపోతే...ఈ దోపిడీ ఇంకా కొనసాగే ప్రమాదం ఉంది.

రైతు బజార్లలో నాణ్యత కరువు

రైతుబజార్లు అన్నింటిలోను నాణ్యమైన ఉల్లి లభించడంలేదనే విమర్శలున్నాయి. ఒక్కో బజారులో నాలుగైదు రకాల ఉల్లి విక్రయిస్తున్నారు. హోటళ్ల, మెస్‌లు, కేటరింగ్ వ్యాపారులకు ఒక రకమైన ఉల్లిని ఇచ్చి, చిల్లరగా కొనుగోలు చేసేవారి రెండో రకం ఉల్లిని అమ్ముతున్నారు. మరి కొందరు రెండు క్వాలిటీలను కలిపి విక్రయిస్తున్నారు. దీంతో రైతుబజార్లులో ఉల్లిపాయల కొనుగోలుకు వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు.

పేలుడుకు పూర్తిగా ధ్వంసమైన తయారీ కేంద్రం

పండుగ వేళ పెను విషాదం

- సూర్యారావుపాలెంలో బాణసంచా పేలుడు
- ఇద్దరు మహిళలు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- పిడుగు పడటంతో ప్రమాదం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వారంతా దినసరి కూలీలు. బాణ సంచా తయారీ కేంద్రంలో పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. దీపావళికి ఒక్కరోజే గడువు ఉండటంతో అంతా పనిలో హడావుడిగా ఉన్నారు. త్వరగా పని ముగించుకుని ఇంటికి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ సమయంలో పిడుగు పాటు వారి కుటుంబాలను విషాదంలోకి నేట్టేసింది. తయారీ కేంద్రంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడటంతో మందుగుండు సామగ్రికి నిప్పంటుకుంది. తేరుకుని బయట పడేలోపే మంటలు చుట్టుముట్టడంతో ఇద్దరు మహిళా కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాల య్యారు. పండుగవేళ చోటుచేసుకున్న ఈ విషాద ఘటన ఉండ్రాజవరం మండలం సూర్యారావు పాలెంలో బుధవారం చోటుచేసుకుంది.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సరిహద్దులో ఉండ్రాజవరం మండలంలో సూర్యారావుపాలెం ఉంది. ఇక్కడ సాయి ఫైర్ వర్క్ పేర వేగరోతు రామశివాజీ బాణసంచా తయారీ కేంద్రాన్ని నడుపుతున్నాడు. గతంలో దువ్వలో ఈ కేంద్రం ఉండేది. ఈ ఏడాది అక్కడ అనుమతులు రాలేదు. దీంతో తూర్పు గోదావరి జిల్లా నుంచి అనుమతులు తెచ్చుకుని కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ కేంద్రానికి ఎక్కువగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు, పెంటపాడు మండలాలకు చెందిన దువ్వ, రావుపాడు గ్రామాలకు చెందిన వారు పనిలోకి వస్తుంటారు. ఎప్పటి లానే బుధవారం కూడా 13 మంది వరకూ కార్మికులు పనికి వచ్చారు. వారితో పాటూ శివాజీ, అతని భార్య శ్రీవల్లి కూడా పనిలో నిమగ్నమయ్యారు. పండుగకు ఒకరోజే సమయం ఉండటంతో పనిని త్వరగా ముగించుకుని వెళ్లిపోవాలని అనుకున్నారు. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. యజమాని శివాజీ బయట ఎవరితోనే మాట్లాడేందుకు కేంద్రం నుంచి బయటకు వెళ్లాడు. ఈ సమయంలో తయారీకేంద్రలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. నిప్పురవ్వలు పేలుడు సామగ్రికి పాకడంతో పెద్ద పెద్ద శబ్ధాలతో పేలుడు సంభవించింది. దీంతో కార్మికులు పొలాల్లోకి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో యజమాని భార్య వేగిరోతు శ్రీవల్లి (35), పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత(38) అక్కడికక్కడే మృతి చెందారు. జంగారెడ్డి గూడేనికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు, తణుకుమండలం దువ్వకు చెందిన కడిమి కుమారి, చుక్కా పెద్దింట్లు, పెంటపాడు మండలం రావుపాడుకు చెందిన మందలంక కమలరత్నం, శీలం లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు.

నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అగ్రిమెంట్ ప్రకారం నిర్ణీత కాలవ్యవధిలో పనులను పూర్తి చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెండర్లలో దక్కిన పనులు జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. పనులు వద్ద తగినంత మంది పనివారిని వినియోగించడం లేదన్నారు. ఫలితంగా పనులు వేగంగా జరగట్లేదన్నారు. ఇసుకకు ఇండెంట్ ఇస్తే జిల్లా అధికారులను సంప్రదించి ఇసుకను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం ముగిసినందున కాంట్రాక్టర్లు పనులను వెంటనే ప్రారంభించి, నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తి చేయాలని కోరారు. సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు పనులను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. రోడ్లను ఎండ్ టు ఎండ్ విధానంలో వేయాలన్నారు. కాలువలు నిర్మించేటప్పుడు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతలో ఎటువంటి విమర్శలకు తావివ్వకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు షేక్ మదర్షా ఆలీ, పి.రీటా, ఎంవికె.మాధవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.సత్యనారాయణ, విరూపాక్షరావు, లోవరాజు, వెంకటలక్ష్మి, అసిస్టెంటు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నడుపల్లిలో సివిల్స్ రైట్స్ డే

ప్రజాశక్తి - పెరవలి

మండలం నడుపల్లి గ్రావ ఎపంచాయతీ ఎస్‌సి కాలనీలో బుధవారం సివిల్ రైట్స్ డేను మానవ హక్కుల సంఘం, తహశీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు స్థానికులు రోడ్ల డ్రెయినేజీలు, శ్మశాన వాటిక ఆక్రమణ తదితర సమస్యలపై తహశీల్దార్‌కు ఫిర్యాదులు అందజేశారు తహశీల్దార్ మాట్లాడుతూ శ్మశానాన్ని సర్వే చేయించి ఆక్రమణల నుంచి కాపాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర సత్యవేణి, రెవిన్యూ అధికారి పావని, పంచాయతీ కార్యదర్శి రాంబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

సురక్షితమైన నీటిని సరఫరా చేయాలి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి తక్షణం అమలు చేయాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట్ల కొత్త పైపులైన్లు వేయాలని, పాత పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటికి ఇబ్బందులు లేని వాతావరణం కల్పించాలన్నారు. సురక్షితమైన మంచినీటిని అందించి.. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. 2027లో పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే ప్రణాళిక బద్ధంగా మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సత్య సాయి మంచినీటి సరఫరా కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. నవంబర్ 10లోపు సత్యసాయి కార్మికులకు నాలుగు నెలల జీతం చెల్లించేలా ఒప్పించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం తినలేం...

ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ హాస్టల్ విద్యార్థినుల ధర్నా

చప్రజాశక్తి - రాజానగరం

పురుగులు, మాడిన పదార్థాలతో భోజనం చేయలేకపోతున్నామని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులు బుధవారం ధర్నా నిర్వహించారు. మెరుగైన భోజం అందించాలని ప్లకార్డులు పట్టుకుని నినదించారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అక్కడికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరిస్తానని, ఆందోళన విరమించాలని వారికి హామీ ఇచ్చారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్లో విద్యార్థినులు, యూనివర్శిటీ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. హాస్టల్‌లో శుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. దీనిపై విద్యార్థులతో హాస్టల్ వెల్ఫేర్ కమిటీ, విశ్వవిద్యాలయం సిబ్బందితో మరో కమిటీ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యార్థినులు జ్యోతిర్మయి, శ్రీలక్ష్మీ, దివ్య, హేమలత తదితరులు మాట్లాడారు. ఈ నెల 23న భోజనం వాసన వస్తుందని చెబితే రిజిస్ట్రార్ చులకనగా మాట్లాడారన్నారు. అనారోగ్యంగా ఉంటే సకాలంలో వైద్యం అందట్లేదన్నారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ పది రోజుల్లో హాస్టల్స్ వెల్ఫేర్ కమిటీ వేసి సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వైద్యం కోసం ప్రత్యేక ఎఎన్‌ఎం నియమిస్తామన్నారు. అదనపు ఛార్జీలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, హాస్టల్ వార్డెన్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బత్తుల

విసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విసికి ఎస్ఎఫ్ఐ వినతి

యూనివర్శిటీలోని ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విసి వై.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ మాట్లాడారు. విద్యార్థినులకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందన్నారు. నాలుగేళ్లుగా ఈ సమస్య తరచూ తలెత్తుందన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్క రించాలన్నారు. ధర్నా చేసిన విద్యార్థినులను యూనివర్సిటీ యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. తీరును మార్చుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, నిశ్చల్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, కో-కన్వీనర్ డి.అశోక్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో 'వనం-మనం'

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుదశారం వనం- మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు, ఎస్ఎంసి చైర్మన్ దిండి రాజు స్కూల్ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. రాజుగారి తోటలో ఎంపిపి స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కొబ్బరి మొక్కలు నాటారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పువ్వల కన్నారావు, హెచ్ఎం, ఉపాధి సిబ్బంది, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో ఎంఎల్ఎ ముప్పిడి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం నేలటూరు సీతారాముల కళ్యాణ మండపంలో బుధవారం అధికారులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి అందరూ పనిచేయాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వక భావంతో ఉండాలన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమ మండల అధ్యక్షులు మట్టా వీరాస్వామి, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ ఎం.మేరికమ్మ, గ్రామ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీరామ్‌చౌదరి, ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కరుటూరు సతీష్, తదితర నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కామరాజుపేట విద్యార్థులు

ప్రజాశక్తి-గోకవరం

అనపర్తి హైస్కూల్లో జిల్లా స్థాయిలో జరిగిన త్రో బాల్ ఆటల పోటీల్లో కామరాజుపేట హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఈశ్వరిదేవి తెలిపారు. బిక్కవోలులో జరిగే రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విజేతలు జి.నందిని, కె.సత్యతేజస్విని, ఎన్.పూజఐశ్వర్య, డి.ధనలక్ష్మిలను సర్పంచ్ అడపా వెంకట్రావు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు అడపా భరత్‌కుమార్, చైర్మన్ రాధాకృష్ణ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మంద కృష్ణను కలిసిన పెందుర్తి

ప్రజాశక్తి - సీతానగరం

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణను మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ తనయకుడు పెందుర్తి అభిరామ్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. నలభై ఏళ్ల పోరాటంలో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎపిలో కూటమి విజయానికి సహకరించినందుకు శాలువాతో సత్కరించారు. మంద కృష్ణ మాట్లాడుతూ అభిరామ్ రాజకీయ అరంగేట్రంలో ఎంఆర్‌పిఎస్ సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు కార్తీక్ ఎంపిక

తాళ్లపూడి : తాళ్లపూడి సెయింట్ యూజీన్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి వేములూరి కార్తీక్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ జాన్ బ్రిట్టో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన మరో 9 మంది విద్యార్థులు జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పాటూ పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

పారిశుధ్య సిబ్బందికి సహకరించాలి

ఉండ్రాజవరం : గ్రామంలోని పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని చివటం పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ ప్రజలకు సూచించారు. రోడ్ల పక్కన చెత్త, డ్రెయినేజీల నుంచి తీసిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు ఎత్తివేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. సూర్యోదయానికి ముందే పారిశుధ్య సిబ్బంది చేపట్టిన పనులను ఆయన స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుగా అందజేయాలని ప్రజలకు సూచించారు.

కోమటికుంటలో భూకమతాల గణన

గోపాలపురం : కోమటికుంట గ్రామంలో భూకమతాల గణను బుధవారం ప్రారంభించారు. ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. రైతులకు పథకాలను అందించేందుకు ఈ గణన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో 20 మంది రైతుల నుంచి 25 రకాల ప్రశ్నావళితో సమాచారం సేకరించామన్నారు. నవంబర్ 5లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మాల్కిన్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఉచిత గ్యాస్‌పై నిబంధనలు ఖరారు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్‌కు నిబంధనలు ఖరారయ్యాయి. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెసి ఎస్.చిన్నరాముడు, డిఎస్ఒ జెవిఎస్.ప్రసాద్ గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు కోసం ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ పథకం కింద ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తొలివిడత సబ్సిడీ కింద నిధులను గ్యాస్ కంపెనీలకు విడుదల చేసిందన్నారు. ఏడాది కాలంలో నాలుగు క్వార్టర్లకు సంబంధించి గ్యాస్ బుకింగ్ విధానం అమలు అవుతుందన్నారు. ఈ క్రమంలో మూడు సిలిండర్ల కోసం చెల్లించిన మొత్తం తిరిగి అర్హత కలిగిన వారి బ్యాంకు ఖాతాలో 48 గంటల్లో జమ అవుతుందని తెలిపారు.



ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడుతున్న జెసి చినరాముడు

ఏజెన్సీ డీలర్లతో మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అర్హత కలిగిన వినియోగదారులను గుర్తించి అవసరమైన డాక్యుమెంట్లను తీసుకోవాలన్నారు. గ్యాస్ కనెక్షన్ కలిగి ఉన్న వ్యక్తి పేరున ఆధార్ కార్డు, ఇకెవైసి, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలన్నారు. జిల్లాలో సుమారు 1.62లక్షలకు పైగా దీపం కార్డులు ఉన్నాయన్నారు. ఏజెన్సీ ద్వారా ఇప్పటి వరకూ సుమారు 20 వేల మందికి చెందిన డేటాను ధ్రువీకరించామన్నారు. మిగిలిన వినియోగదారులకు సంబంధించిన సమాచారం సేకరించాలన్నారు. ప్రజా ప్రతినిధులు సమక్షంలో నవంబర్ 1న ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జెవిఎస్.ప్రసాద్, ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ ప్రతినిధులు ప్రశాంతి, రామారావు, అప్పాజీ, పిఎస్ఎన్.రెడ్డి, పౌర సరఫరాల అధికారులు, వివిధ గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.

వర్షపు నీటితో కాలువలా మారిన రహదారి

జిల్లాలో అకాల వర్షం

ప్రజాశక్తి - గోపాలపురం, రాజమహేంద్రవరం

జిల్లాలో బుధవారం పలుచోట్ల అకాల వర్షం కురిసింది. రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్‌లో కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రెయినేజీలు వర్షపు నీటితో నిడి పొంగొపొర్లాయి. గోపాలపురంలో 30.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. దీపావళి సావగ్రి అమ్మకాల కోసం ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణాలు పలుచోట్ల పడిపోయాయి. వాదాలకుంట, కోమటికుంట పరిసర పొలాల నుంచి వర్షపు నీరు రోడ్లపైకి చేరింది.

బాణసంచా వ్యాపారుల దిగాలు

తాళ్లపూడి : బుధవారం కురిసిన భారీ వర్షానికి బాణ సంచా దుకాణదారులు దిగాలు చెందారు. వాతావరణంలో మార్పులు వారిని కలవరానికి గురిచేస్తున్నాయి. గురువారం కూడా పరిస్థితి ఇలాగే ఉంటే నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా కొనుగోలుదారులు రాకపోవడంతో తాము నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని లక్ష్మీ అనే వ్యాపారి వాపోయింది. వర్షం నేపథ్యంలో కొనుగోలుదారులు లేక బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు పుష్కర కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభించింది. విఆర్ఓ పేరూరి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలువలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసినట్లు ఎస్ఐ శివనాగ తెలిపారు. మురారి చుట్టుపక్కల ప్రాంతాల్లో మిస్సింగ్ కేసులు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగివుండవచ్చని, మృతదేహంపై నాచురంగు లోయరు, సిమెంటు రంగు బనియన్, ఎరుపు నీలం రంగు జబ్బల బనియన్, ఎడమ చేతికి పసుపు రంగు తాడు ఉండి, కుడి చేతి పై శ్రీరామ్ అను పచ్చబొట్టు ఉండి కుడి చేయి దండపై పులిబొమ్మ ఉందన్నారు. విఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ ప్రాంగణంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో తిరుగుతున్న అంగర గ్రామానికి చెందిన ముద్రగడ చంద్రశేఖర్ (35)గా గుర్తించారు. అతని బంధువులకు సమాచారం అందజేయగా వారు మృతదేహాన్ని తీసుకు వెళ్లారని ద్రాక్షారామం ఎస్ఐ ఎం.లక్ష్మణ్ విలేకరులకు తెలిపారు.

వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కోరుమిల్లి గ్రామానికి చెందిన ఖండవల్లి కాశీ విశ్వనాథం(67) ఈ నెల 28న కోరుమిల్లి ప్రధాన పంట కాలువలోకి స్నానానికి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. బుధవారం గ్రామంలోని లాకుల వద్ద ఆయన మృతదేహం లభ్యమయింది. ఆయన భార్య సూర్య నాగమణి ఫిర్యాదు మేరకు అంగర ఎస్ఐ డి.రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

70 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని రాచపల్లి గ్రామ శివారున 70 లీటర్లు సారా అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగా పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం షాపులో చోరీ

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మద్యం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.43 వేల విలువగల నగదు, మద్యం చోరీ చేశారని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. దుండగులు తాళాలు బద్దలగొట్టి షాపులోకి చొరబడ్డారు. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. షాపు యజమాని, సూపర్‌వైజర్‌తో కలిసి వివరాలు సేకరించారు. 21 మద్యం ఫుల్ బాటిల్స్, రూ.15,600 నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. షాపు సూపర్‌వైజర్ అడప ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై నీటి పిల్లి దాడి

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలో బుధవారం అనూహ్య సంఘటన సంభవించింది. పెద్ద కాలువ వద్దకు స్నానం చేయడానికి వెళ్లిన అయ్యప్ప మాలధారణలో ఉన్న పి.విజయ్ కుమార్‌పై నీటి పిల్లి దాడి చేసి గాయపరిచినట్లు ఆయన తెలిపారు. దీనితో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. విజయ్ కుమార్‌ను వెంటనే స్థానిక సిహెచ్‌సికి తరలించి వైద్యం అందించారు. ఈ అంశంపై ఆలమూరు వెటర్నరీ ఎడి డాక్టర్ ఎల్.అనిత స్పందిస్తూ సాధారణంగా నీటి పిల్లులు మన వైపు కనబడవన్నారు. ఈ మధ్య గోదావరిలో నీటి పిల్లులు కనపడుతున్నాయన్నారు. సాధారణంగా ఇవి మనుషులపై దాడి చేయవని, పిల్లలను పెట్టే సమయంలో భయభ్రాంతులకు గురై దాడి చేసే అవకాశం ఉందని తెలిపారు. ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు.

నగరంలో టిడిపి సభ్యత్వ నమోదు

టిడిపి సభ్యత్వంతో భరోసా

ప్రజాశక్తి - మామిడికుదురు

టిడిపి సభ్యత్వం కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని జెడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. నగరంలో బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ శాఖ అధ్యక్షులు జాలెం సుబ్బారావు ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వర్దినేని బాబ్జి, నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, ముఖరం, రాష్ట్ర వాణిజ్య సెల్ ప్రధాన కార్యదర్శి బోణం బాబు, చుట్టుగుళ్ల కిషోర్, గుబ్బల నరసింహశెట్టి, మొల్లేటి పార్వతి, కోళ్ల సురేష్ బాబు, రాయుడు శ్రీనివాస్, బొంతు శ్రీనివాస్ జాలెం ప్రసాద్, వానరాశి రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా అశోక్‌కుమార్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఐ.పోలవరం

పివి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ పండు అశోక్ కుమార్ పుట్టినరోజు వేడుకలు బుధవారం పాతఇంజరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పాతఇంజరం -ఎదుర్లంక వారధి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల దండ వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అశోక్ కుమార్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టా గగన వీరుడు, రేవు శ్రీను, పండు విజయ్ కుమార్, పండు మురళి, పచ్చిమాల విజయ్ కుమార్, వడ్డి ఏడుకొండలు, రేవు రెడ్డిబాబు పాల్గొన్నారు.

ఎంపిడిఓ జాన్ లింకన్ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు ఎంపిడిఓగా జాన్ లింకన్ సేవలు ఎనలేనివని ఎంపిపి బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని కొత్తూరు సెంటర్లోని ఫంక్షన్ హాల్లో స్థానిక ఎంపిడిఓ కె.జాన్ లింకన్ ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమాన్ని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి పి.రాజబాబు, మాజీమంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ విజయ్ కుమార్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి బండారు మాట్లాడుతూ జాన్ లింకన్ అంకితభావంతో పనిచేస్తూ పలువురు మెప్పు పొందారన్నారు. గత 20 ఏళ్లుగా వివిధ శాఖలలో ఆయన విధులు నిర్వహించారని, ఐఎఎస్ కోచింగ్ సెంటర్ కూడా నడిపారన్నారు. అనంతరం జాన్ లింకన్ దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ జాన్ లింకన్‌ను సత్కరిస్తున్న ఎంపిపి

భూ సమస్యల పరిష్కారం కోసం సభలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులంతా వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అన్నారు. అంగర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామ సభలో తహశీల్దార్ పి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దేందుకే గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, పుచ్చల శ్రీనివాస్, ఎంపిటిసి అడ్డాల శ్రీనివాస్, కార్యదర్శి ఆర్ఎంవివిఎస్.ఈశ్వరరావు, గ్రామ విఆర్ఓలు పి.సత్యనారాయణమూర్తి, గుమ్మడి సీతామహాలక్ష్మి, రెవెన్యూ అధికారులు, విఆర్ఓలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

రైతు సేవా కేంద్రాలతో గిట్టుబాటు ధర

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడానికే రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు అని రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మోకా ఆనంద్ సాగర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో బుధవారం ధాన్యం కొనుగోలు సిబ్బంది శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆనంద్ సాగర్ మాట్లాడారు. రైతులు దళారుల చేతులలో మోసపోకుండా, గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం బాల సరస్వతి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రైతు సేవ కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు, జిల్లా సహాయ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఆనంద్ సాగర్

అంబేద్కర్ చిత్రపటం ఆవిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ నాయుడు, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, విప్ సాయి ప్రసాద్, కౌన్సిలర్ లు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశంలో రూ.4 కోట్ల పనులను నిలిపివేస్తూ తీర్మానాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో ఆమోదం పొందిన పనులను నిలిపివేస్తూ సభ తీర్మానించింది. రామచంద్రపురం పురపాలక సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పురస్కారం ప్రకటించిందని కమిషనర్ వి.ఐ.నాయుడు తెలిపారు.

అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌కు అభిషేక్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మోడరన్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి బోను అభిషేక్ బ్యాడ్మింటన్ టీమ్ విన్నర్‌గా వ్యక్తిగత విభాగంలో స్టేట్ లెవెల్‌లో రన్నర్‌గా నిలిచి సత్తా చాటినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జివి.రావు తెలిపారు. అభిషేక్ నవంబర్ 17 నుండి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా అభిషేక్ మెరుగ్గా రాణించాలని రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అభిషేక్‌ను అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, హెచ్ఎం ఎం.చిట్టిబాబు, మోడరన్ స్టాఫ్ అభినందించారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌కు ఎంపికైన అభిషేక్

హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

బాల బాలాజీ ఆదాయం రూ.35.52 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానానికి 98 రోజులకు హుండీల ఆదాయం రూ.35 లక్షల 52 వేల ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ఇఒ రాగోలు శ్రీనివాస్ పర్యవేక్షణలో బుధవారం జరిగిన ఈ లెక్కింపులో హుండీల ఆదాయం రూ.35 లక్షల 622 రాగా, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.52,096 ఆదాయం సమకూరిందన్నారు. ఎనిమిది గ్రాముల బంగారం రాగా 120 గ్రాముల వెండి వచ్చిందన్నారు.

అధ్యాపకులపై నిరంకుశ వైఖరి విడనాడాలి

ప్రజాశక్తి - రాజోలు

మలికిపురం ఎంవిఎన్ జెఎస్, ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తమ పెండింగ్ జీతాలు చెల్లించాలని చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం 50వ రోజుకు చేరాయి. జీతాలు చెల్లించి సానుకూలంగా సమస్యను పరిష్కరించి అధ్యాపకులను లోపలకి తీసుకొని వెళ్లి విద్యార్థుల భవిష్యత్తును కాపాడవలసిన కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ ఎంవి. సత్యనారాయణ మూర్తి అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం శోచనీయమని, అధ్యాపకులపై నిరంకుశ వైఖరిని వీడనాడాలని స్థానిక నాయకులు, పెద్దలు పేర్కొన్నార ు.మొదట్లోనే అధ్యాపకులతో సంప్రదింపులు చేసి చిన్నగా పరిష్కారం చేయవలసిన విషయాన్ని ఇంత పెద్ద స్థాయికి సాగదీయడం వెనుక కరస్పాండెంట్ కుట్ర దాగి ఉందనాన్రు. అధ్యాపకులకు సిపిఎం నాయుకులు సిహెచ్.సూర్యప్రకాశరావు, ఆర్.రాజు, నల్లి శివకుమార్, బిఎస్‌పి నాయకులు జాన్ మోషే మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి అధ్యాపకులు యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధ: అయినట్లు అధ్యాపకుల సంఘం నాయకులు తెలిపారు.

జనరిక్ షాపులను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ ప్రయోజన ఔట్లెట్ జనరిక్ మందుల షాపులను ప్రజలకు చేరువ చేయాలనీ, బ్రాండ్ పేరుతో కార్పొరేట్ ఫార్మాసిటికల్ కంపెనీల దోపిడీని అరికట్టాలని ఆర్‌సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ ప్రయోజన ద్వారా దేశంలో 12,500 అవుట్లెట్లను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసినప్పటికీ జనరిక్ మందులు కొనుగోలు చేయడంలో ప్రజలు, వినియోగదారులు పూర్తిస్థాయిలో సఫలం కాలేక పోతున్నారన్నారు. బడుగు బలహీన సామాన్య ప్రజలకు ఈ స్కీము అమలు అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ, అరుణ కుమారి, పార్వతి, పుష్ప, అనంతలక్ష్మి, జిత్తుగ అనంతలక్ష్మి, గుణవర్ధనమ్మ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న పార్టీ సభ్యులు

శ్రీనివాస కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇటీవల రామచంద్రపురం విఎస్ఎం కళాశాలలో నిర్వహించిన మార్చ్-2024 ఎఆర్‌సిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ విభగాల్లో ప్రథములుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ, ఇటీవల విఎస్ఎం కళాశాలలో నిర్వహించిన మార్చ్-2024 ప్రతిభాన్వేషణ పోటీలైన ప్రాజెక్ట్ ఎక్స్పో, టెక్నికల్ క్విజ్, రోబో రేస్, మోడల్ మేకింగ్, కనస్ట్రక్షన్ విత్ కార్డ్స్ వంటి విభాగములు, ట్రెజర్ హంట్ యూస్ లెస్ టు యూజ్ వంటి పవర్ పాయింట్ ప్రజంటేషన్ విభాగములలో విశేష ప్రావీణ్యము కనబరిచారని తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, సివిల్ విభాగాధిపతి ఎస్.చక్రవర్తి కళాశాల విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.జయలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన శ్రీనివాసా కళాశాల విద్యార్థులు

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

ఎపి వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్స్ ఉద్యోగుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పినపళ్ల పశు వైద్యాధికారి డాక్టర్ ఈదల శ్రీనివాసరావు ద్వితీయ కుమార్తె గాయత్రి వివేక్ యుఎస్‌లోని అట్లాంటాలో నివాసం ఉంటారు. ఆమె 25వ పుట్టినరోజు సందర్భంగా ఈదల శ్రీనివాసరావు ఆలమూరులోని సమీకృత బాలుర వసతి గృహ విద్యార్థుల సమక్షంలో తమ ఇంటి వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు దుప్పట్లను అందజేశారు. హాస్టల్ విద్యార్థులు ఈ సందర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఈదల శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులతో వైద్యులు శ్రీనివాసరావు

సోమేశ్వరాలయంలో మంత్రి సుభాష్ పూజలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం కోటిపల్లి శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు పురోహితులు అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ గల ఛాయా సోమేశ్వర స్వామిని, రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల ఆరోగ్యం పట్ల తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, దానిలో భాగంగానే జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు తాము కృషి చేస్తున్నామని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిజిహెచ్‌ను ఆయన బుధవారం సందర్శించారు. రోగులు, వారి సహాయకుతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించారు. ఇక్కడ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని ప్రజలు విశ్వసిస్తారన్నారు. దాని అనుగుణంగానే రాజమండ్రి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో వైద్యం కోసం ఈ ఆసుపత్రికి వస్తుంటారని అన్నారు. సర్వర్ లోపం కారణంగా ఒపిలో కొద్దిగా జాప్యం జరుగుతోందని, దానిని కూడా సరి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సర్వర్ పని చేయని పక్షంలో మాన్యువల్‌గా ఒపి ఇస్తున్నారన్నారు. ఆరోగ్యకర రాజమండ్రిలో భాగంగా మొదటి అడుగుగా నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేశామన్నారు. ప్రజలకు అత్యవసరమైన వైద్యంపై దృష్టి పెట్టామన్నారు. ఆసుపత్రి స్కానింగ్ మెషిన్లను కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉమెన్ క్రికెట్ సెలక్షన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ ఉమెన్ క్రికెట్ టీమ్ సెలక్షన్స్‌ను రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి మహిళ క్రికెట్ క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనపరచిన 15 మంది విద్యార్థులను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి నవంబర్ 15 నుంచి మైసూర్‌లో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపిస్తామని స్పోర్ట్స్ బోర్డ్ ఇన్‌ఛార్జి సెక్రటరీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎస్‌పి.వీరయ్యగౌడ్ , ఆర్గనైజింగ్ చైర్మన్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ విఎస్.దేవానంద్, అబ్జర్వర్ డాక్టర్ సెలున్‌రోజ్, సెలక్షన్ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

మహిళల అకృత్యాలను అరికట్టడంలో విఫలం

ప్రజాశక్తి - దేవరపల్లి

దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, వారిపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐఎఫ్‌టియు నాయకులు రమేష్ అన్నారు. గౌరీపట్నం, కొండ గూడెంలో ఈ మేరకు ఇఫ్టూ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్ అయోధ్యలో జరిగిన అత్యాచారాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ కరువైందన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక హింసను ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలోనూ హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. సమస్యలపై మహిళలు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు నాగేశ్వరావు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - రావులపాలెం

రావులపాలెం సెయింట్ పాట్రిక్స్ అకాడమీ స్కూల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి అంటే వెలుగు అని, జీవితాల్లో వెలుగు నింపుకొని, పదిమందికి పంచాలని, దీపావళి అంటే దీపాలు వెలిగించే పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపల్ బ్రదర్ అను మాథ్యూ, కమ్యూనిటీ లీడర్ బ్రదర్ ఫెలిక్స్ అరుణ్, సాధనాల సత్యనారాయణ, బలుసు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

In the Court of the IVth Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 401/2024

Between:
State Bank of India, Sarpavaram Junction Branch, Kakinada, Rep. by its Branch Manager. ...*Plaintiff*
AND
Komarthi Narayana Rao ...*Defendant*

To:
Komarthi Narayana Rao, S/o. Kameswara Rao, aged 37 years, D.No. 4-74, Near Panchayat Office, Sarpavaram, Kakinada Rural Mandal, Kakinada Dist.,

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 15-11-2024వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ
సెల్: 9866211196

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
HMOP. NO: 51/ 2023

Between :
మందలపు వినోద్ కుమార్ ...... పిటిషనరు
V/s
మందలపు ఎలియాస్ పంపన కళ్యాణి..రెస్పాండెంటు

To
మందలపు ఎలియాస్ పంపన కళ్యాణి
W/o వినోద్ కుమార్, R/o హుకుంపేట (గ్రామం), మరియు (పోస్టు), రాజమండ్రి రూరల్ (మండలం) తూర్పుగోదావరి (జిల్లా) ఆంధ్రప్రదేశ్.
(రెస్పాండెంటు)

పైన తెలిపిన పిటీషనరు మీ పైన SEC 9 హిందూ వివాహ చట్టం ప్రకారం మిమ్ము కాపురమునకు రమ్మనికోరుచూ దాఖలు చేసుకున్న పై నెంబరు పిటిషన్లో మీరు రెస్పాండెంటు అయివుండి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిన ప్పటికీ తీసుకొనక కాలయాపన చేయు చున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయవలసినదిగా కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 15-11-2024 న తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపవలెను. లేనిచో మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానించబడునని ఇందుమూలక ముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి అనుమతితో//

అద్దంకి: ఇట్లు
తేది :29-10-2024 పంచాగ్నుల రమేష్
అడ్వకేట్ /అద్దంకి
బాపట్ల జిల్లా.
సెల్ నెం : 99487 88290

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
A.S. No. 104/2023

Between:
Ch.Subba Rao ...*Appellant*
AND
Association of Promoting Spiritual and Socio Economic Activities and Others ...*Respondents*

R-4: అనిశెట్టి వెంకటాచలం,
S/o. లక్ష్మీ నరసింహమూర్తి,
రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 05-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి జె.బి.ఎస్.బాపూజీ
30-10-2024 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కాకినాడ
E.A. No. 123/2024
E.P. No. 160/2020
O.S. No. 488/2006

Between:
మల్లిపూడి వెంకటకృష్ణ సుబ్బారావు ...*DHr*
మరియు
చింతపెంట సావిత్రిదేవి ...*JDr*

To:
చింతపెంట సావిత్రిదేవి, W/o. వెంకట సుబ్బారావు, డోర్ నెం. 7-2-1, రామారావుపేట, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు అమలు గ్రంధములో JDr అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. **15-11-2024వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై అమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ
సెల్: 9866211196

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 349/2023

Between:
State Bank of India, R.A.S.M.E.C.C.C. & S.A.R.C., Danavaipeta, Rajahmundry, Rep. by its Manager, S.A.R.C. wing ...*Plaintiff*
AND
Peddireddi Peddiraju, S/o. Satyanarayana, aged 41 years, H.No. 28/188, Near Daggula Hospital, Penugonda Mandalam, W.G.District, Pin: 534 320. ...*Defendant*

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 15-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.సుజాత, అడ్వకేట్
రాజమండ్రి ప్రకాష్‌నగర్, రాజమండ్రి
30-10-24 సెల్:8317648715

In the Court of the Principal Senior Civil Judge, Kakinada
I.A. 358/2024 in O.S. 151/2021

Between:
1. M.Balaji Babu
2. Pasupuleti Prem Kumar ...*Petitioners/ Plaintiffs*
AND
1. Kosireddy Gurumurthy Naidu
2. Thota Rama Rao (died) Others ...*Respondents/ Defendants*

To:
5th Respondent:
Perneedi Satyaveni, W/o. Sathi Raju, age 58 years, D.No. 70-17A-25/11/1, Soujanya Nagar, Kakinada, Kakinada Dist.,

The Petitioner filed above petition preying Hon'ble Court to add you as 5th Defendant as legal heir of deceased 2nd Defendant in above suit. Take notice that you are hereby directed to appear before above Hon'ble Court **on 19-11-2024 at 10.30 AM** to submit your answer. Otherwise the matter will be decided in your absence. This notice was issued as per the order of Hon'ble Court through this paper publication.

D.SURYANARAYANA MURTHY
V.VIJAYARAJ KUMAR
V.KONDALA RAO
Advocates, Kakinada
Cell: 8247256301, 9177313333